



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గేయానంద్

పారిశ్రామికవాడల్లో కన్పించని అభివృద్ధి

మౌలిక వసతులు లేక ఇబ్బందులు

నూతన పరిశ్రమల ఏర్పాటుపై సర్కారు నిర్లక్ష్యం

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంలో ఉన్నాయి. 1985వ సంవత్సరం అక్టోబర్ 16వ తేదీన అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పారిశ్రామిక వాడను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు ఇక్కడ వందలాది పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. అయితే పారిశ్రామిక వాడలో మాత్రం అభివృద్ధి జాడ కనిపించడం లేదు. పారిశ్రామిక వాడలో వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కనీసం రోడ్ల విషయంలో కూడా శ్రద్ధ చూపించ లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం కర్నాటక రాష్ట్రానికి అత్యంత దగ్గరగా ఉండటంతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం దగ్గరగా ఉంది. దీంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ఎక్కువ మంది వస్తుంటారు. దీంతో పాటు కర్నాటక రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన కోసం పెట్టుబడి ఎక్కువగా ఉండటంతో పారిశ్రామిక వేత్తలు ఇక్కడికి వస్తున్నారు. అంతే కాకుండా అక్కడ స్థలం దొరకడమే కష్టంగా ఉండటంతో పాటు అనుమతులు కూడా రావడం లేదు. పైగా ఖర్చు కూడా విపరీతంగా ఉండటం, అది పెట్టుబడి, ఆదాయం మీద ప్రభావం చూపడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ప్రభుత్వం స్థలం కేటాయించడంతో పాటు అనుమతులు సైతం సులువుగా ఇస్తుందన్న భావనతో పారిశ్రామిక వేత్తలు ఎక్కువ మంది ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు మొగ్గు చూపుతారు. అయితే పారిశ్రామిక వాడలో ప్రస్తుతం ఎటువంటి అభివృద్ధి లేకపోవటంతో చాలా మంది పారిశ్రామిక వేత్తలు రావడం లేదు.

ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా పారిశ్రామిక వాడ అభివృద్ధి జరగడం లేదు. గత వైసిపి ప్రభుత్వం పారిశ్రామిక వాడ అభివృద్ధికి కనీస చర్యలు చేపట్టలేదు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆ ప్రభుత్వ హయాంలో చెప్పుకోదగ్గ పరిశ్రమ ఒక్కటి రాలేదు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 8 పారిశ్రామికవాడలు ఉన్నాయి. 1979లోనే అనంతపురంలో జోనల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. అప్పుడే ఇక్కడ పారిశ్రామికవాడను నెలకొల్పారు. అయితే 1985లో ఎన్టీఆర్ హయాంలో



తూమకుంట పారిశ్రామిక వాడ

పారిశ్రామిక వాడను ప్రత్యేకంగా అభివృద్ధి చేశారు. పారిశ్రామిక వాడలో 151 చిన్న, మధ్య, భారీ తరహా పరిశ్రమలు ఏర్పాటు కాగా ప్రస్తుతం అందులో 30 వరకు మూతపడ్డాయి. మౌలిక వసతులు సరిగ్గా లేకపోవడంతో యజమానులు అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య, అంతర్గత రహదారులు దెబ్బతినటం, మురుగు కాలువలు లేకపోవటం, వీధి దీపాల నిర్వహణ గాలి కొదిలేయడం వంటివి ప్రధానంగా వేధిస్తున్నాయి. చాలాచోట్ల అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. వారానికి ఒకసారి మాత్రమే నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో నిర్వాహకులు రోజూ నీటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో పాటు పెరిగిన విద్యుత్తు ఛార్జీల భారాన్ని మోయలేకపోతున్నామని నిర్వాహకులు వాపోతున్నారు.

హిందూపురం సమీపంలోని తూమకుంటలోని గోళాపురం పారిశ్రామికవాడ వేదిక్ ఇస్పాట్, శాంతి స్టీల్, రిష్ మిరల్, చిన్న పరిశ్రమలు మూడు మొత్తం ఆరు మూతపడ్డాయి. ఆర్థిక ఇబ్బందులకు తోడు భాగస్వాముల మధ్య విభేదాలు ఏర్పడటంతోనే ఇవన్నీ మూతపడ్డాయి. హిందూపురం జోనల్ పరిధిలో తూమకుంట పారిశ్రామికవాడలో 50 ఎకరాలు, రహేజా కంపెనీకి చెందిన గోళాపురం పారిశ్రామిక 254 ఎకరాలు నేటికి ఖాళీగా ఉన్నాయి. అనంతపురం జోనల్ పరిధిలో 2007లో ఏర్పాటైన రాప్తాడు పారిశ్రామికవాడలో 37 ఎకరాలు ఖాళీగా ఉంది. మిగతాచోట్ల కేటాయింపులు జరిగాయి. తూమకుంటలో కొంత భూమి, గోళాపురంలో దాదాపు 50 శాతం భూమి ఖాళీగా ఉంది. స్థలాలు కేటాయిస్తున్నా వివిధ కారణాలు చెప్పి పరిశ్రమలు ఏర్పాటులో జాప్యం జరుగుతోంది. 1978లో బళ్లారి రోడ్డులో ఉన్న పారిశ్రామిక వాడలో 71కి గాను 50 యూనిట్లు నెలకొల్పారు. ఇందులో 3 మూతపడ్డాయి. రాప్తాడు పారిశ్రామిక వాడను 2017లో ఏర్పాటు చేశారు. ఎంఎస్ఎంఇలకు కూడా 51ఎకరాలు కేటాయించారు. 322ప్లాట్లలో 197 కేటాయించారు. 1974లో గుంతకల్లు పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి 57 ఎకరాలు కేటాయించారు. ప్రస్తుతం 17 యూనిట్లు పనిచేస్తుండగా 14 మూతపడ్డాయి. ఇక్కడా నీటి సమస్య వేధిస్తోంది. వైటీచెరువు వద్ద కొత్త పారి శ్రామిక ఏర్పాటుకు 100 ఎకరాలు కేటాయించాలని ప్రతిపాదనలు ఉన్నా గత ప్రభుత్వం భూమిని కేటాయించకలేదు. తాడిపత్రిలో 15 యూనిట్లు పనిచేస్తుండగా 6 మూతపడ్డాయి.

తగ్గిన ఆసక్తి

ఉమ్మడి అనంత జిల్లాలో ఔత్సాహికులు ఉన్నా ప్రభుత్వం పలు నిబంధనలు మార్చడంతో పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు. గతంలో పరిశ్రమ ఏర్పాటు చేసిన కొన్నేళ్లకు భూమిని నిర్వాహకులకు అప్పగించేవారు. ప్రస్తుతం 23 ఏళ్లకు లీజు పద్ధతిలో కేటాయిస్తున్నారు. కొన్నిచోట్ల ధరలు పెంచడంతో పరిశ్రమల ఏర్పాటుకు వెనక్కి తగ్గుతున్నారు. గతంలో ఎకరా భూమి రూ.25 లక్షలు ఉంటే ప్రస్తుతం రూ .75 లక్షలకు పెంచారు. విద్యుత్తు, ఇంధన ధరలు పెరగడంతో ఆర్థిక భారం పెరిగిపోయింది. దీంతో ఔత్సాహికులు పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపడం లేదు.



పారిశ్రామిక వాడలో ఖాళీగా ఉన్న స్థలం

కులమతాల పేరిట మారణ హోమం వద్దు

జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్

ప్రజాశక్తి - రాయదుర్గం

కులమతాల పేరిట ఘర్షణలు మారణ హోమాలు వద్దని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ చెప్పారు. జెవివి ఆధ్వర్యంలో ఆదివారం రాయదుర్గంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు డాక్టర్ గేయానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 2వేల సంవత్సరాల క్రితం బౌద్ధం, వెయ్యి సంవత్సరాల క్రితం జైన మతం దేశంలో పరిఢవిల్లినట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం కులమతాల పేరిట ఘర్షణలు జరగడం విచారకరమన్నారు. చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు, చారిత్రక విశేషాలు తెలుసుకునేందుకు చారిత్రక ప్రదేశాలలో హెరిటేజ్ వాక్ నిర్వహించాలన్నారు. ఈ విషయమై పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు ద్వారా విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవడి భవిష్యత్తులో బాధ్యతగల పౌరులుగా శాస్త్రీయ అవగాహనతో మెలుగుతారని డాక్టర్ గేయానంద్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 4 లక్షల మంది విద్యార్థులు పాల్గొంటున్న ఏకైక సైన్స్ కార్యక్రమం చెకుముకి సంబరాలు అని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 24 మండలాలకు చెందిన 24 జట్లు సైన్స్ పరీక్షలు రాయగా ప్రభుత్వ పాఠశాల నుండి గుత్తి మోడల్ స్కూల్ ఎంపిక కాగా అనంతపురానికి చెందిన లక్ష్మీ సినర్జీ వైట్ హైస్కూల్ రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయింది. ఈ రెండు పాఠశాలల విద్యార్థులు వచ్చే నెల 9 ,10 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర సైన్ సంబరాల్లో పాల్గొంటారని జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో సైంటిస్ట్ డాక్టర్ కామ్మూర్తి రవితేజ , జిల్లా అధ్యక్షులు వెంకటరామిరెడ్డి, అనంతపురం నగర గౌరవ అధ్యక్షులు గంగినాయక్, సాంస్కృతిక బృందం సాకే లక్ష్మీనారాయణ, ప్రసాద్, యూత్ కన్వీనర్ రాఘవేంద్ర, రాయదుర్గం శాఖ గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు మొహమ్మద్ అయూబ్, అధ్యక్ష కార్యదర్శులు వీరన్న, జగదీష్, మాన్తేష్, రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హులికుంటి మూర్తి, సంయుక్త కార్యదర్శి గుడేకోట శివకుమార్, ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

ప్రజాశక్తి - శింగనమల

పంటనష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందజేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో సిపిఎం మండల మహాసభ నిర్వహించారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శితో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం బాల రంగయ్య , ఓ నల్లప్ప హాజరయ్యారు. అనంతరం వి. రాంభూపాల్ మాట్లాడుతూ భూమిలేని నిరుపేదలకు ఐదు ఎకరాల పొలం ఇవ్వాలన్నారు. పంటనష్టపోయిన రైతులకు పెట్టుబడి సాయం కింద ఎకరాలకు 20 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. రైతులను, కార్మికులను ఆదుకోవటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అంతకు ముందు జరిగిన మండల మహాసభ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌తో పాటు 13 మంది మండల కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా టిటిసి పరీక్షలు

ప్రజాశక్తి -అనంతపురం

నగరంలోని రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాలలో ఆదివారం టిటిసి (లోయర్ గ్రేడ్-థియరీ) పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి 3 గంటలు, మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకూ మూడు సెషన్లలో పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా కేంద్రం వద్ద మెడికల్ సిబ్బంది మందులను అందుబాటులో ఉంచారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలను డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు, ఎసి గోవిందనాయక్ పరిశీలించారు. ఈ పరీక్షలకు 93 మందికి 87 మంది హాజరైనట్లు డిఇఒ తెలిపారు.



టెట్ పరీక్షలను పరిశీలిస్తున్న డిఇఒ ఎం.ప్రసాద్‌బాబు



మృతిచెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పోలీసులు

గొర్రెల మందపై దూసుకెళ్లిన లారీ

50 జీవాలు మృతి

ప్రజాశక్తి - ఉరవకొండ

ఉరవకొండ పట్టణ శివారులో 42 వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున గొర్రెల మందపై లారీ దూసుకెళ్లింది. దీంతో 50 గొర్రెలు మృతి చెందాయి. మరో 30 గాయపడ్డాయి.అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు కర్నాటక రాష్ట్రం హగిరి ప్రాంతానికి చెందిన నాగరాజు, మంజునాథ్ తదితరులకు సంబంధించి గొర్రెలను ఆదివారం తెల్లవారుజామున మేత కోసం ఉరవకొండ సమీపంలో తోలుకెళ్తున్నారు. ఆ సమయంలో అనంతపురం వైపు నుంచి హొస్పేట వైపు లోడుతో వస్తున్న లారీ ఉరవకొండ సమీపంలో మందపై దూసుకెళ్లింది. దీంతో 50 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పశువైద్యులు సంఘటన స్థలంలోనే మృతి చెందిన వాటికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ప్రమాదంలో తమకు సుమారు రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు గొర్రెల కాపరులు వాపోయారు. ఈ ప్రమాదంపై లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

హెచ్చెల్సీలో రైతులే కంపచెట్లను తొలగించుకోవాలి

తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్లూరు

రైతులే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి హెచ్చెల్సీలో ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించుకోవాలని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని హెచ్చెల్సీలో కంపచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని జెసి ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఐక్యతగా హెచ్చెల్సీకి ఇరువైపు కంపచెట్లను తొలగించుకోవాలన్నారు. అలాకాకుండా ప్రభుత్వమే చేస్తుందులే అనుకుంటే మీరే నష్టపోతారని హెచ్చరించారు. ఇకపోతే కాలువ మీద లస్కర్లు లేరని రైతులు జెసి దృష్టికి తీసుకురావడంతో వెంటనే హెచ్ఎల్‌సి ఎస్ఇతో ఫోనులో మాట్లాడి హెచ్ఎల్‌సికి నీరు వచ్చేంత వరకూ టెంపరరీగా లస్కర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం హెచ్చెల్సీలో కంపచెట్ల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టిన పుట్లూరు పుల్లారెడ్డిని జెసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోమటికుంట్ల కులశేఖర్‌రెడ్డి, ఎల్‌కె.చెన్నారెడ్డి, రామమునిరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, సంజీవపురం పవన్‌కుమార్‌రెడ్డి, రంగయ్య, గోపాల్‌రెడ్డి, శివనారాయణరెడ్డి, రామ చంద్రారెడ్డి, శివారెడ్డి తదితర టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి


నేడు గుంతకల్లులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

అనంతపురం : గుంతకల్లు ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతోపాటు జాయింట్ కలెక్టర్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కొనసాగుతుందన్నారు. ఇక్కడ డిఆర్‌ఓ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు.

104 ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

104 ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా గౌరవాధ్యక్షులు ఎజి రాజమోహన్ తెలిపారు. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో 104 ఉద్యోగుల యూనియన్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన బకాయి జీతాలు, ఇపిఎఫ్ యాజమాన్యం వాటా కట్టాల్సిన వాటా యాజమాన్యం కట్టాలని, 104 వాహనాలను పిహెచ్‌సిల ఆధ్వర్యంలో నిర్వహించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 1న సక్రమంగా జీతాలు చెల్లించాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న రోజుల్లో ఆందోళనలను చేయడానికి త్వరలో కార్యచరణ రూపొందించనున్నట్లు వివరించారు. అనంతరం 104 ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులుగా శివకృష్ణను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్రమ్మణ్యం, ట్రెజరర్ కిషోర్‌బాబు, రామకృష్ణ, తిప్పేరుద్ర, వికె.మల్లి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 104 ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు శివకృష్ణ

పెన్షనర్లు, ఉద్యోగులకు ప్రతినెలా సక్రమంగా చెల్లింపులు

జిల్లా ఉప ఖజానా సంచాలకులు కావలి రామారావు నాగమల్లిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలో పెన్షనర్లకు ఉద్యోగస్తులకు వేతనాలు నెలనెలా సక్రమంగా అందిస్తున్నామని జిల్లా ఉప ఖజానా సంచాలకులు కావలి రామారావు నాగమల్లిక పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఆదివారం ప్రజాశక్తి కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎంతమందికి పెన్షన్లు, ఉద్యోగస్తులకు వేతనాలు ట్రెజరీ నుండి అందుతున్నాయి .?

జవాబు : శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 32 మండలాలలో ఉన్న 8 999 మంది పెన్షనర్లకు, 18,799 మంది ఉద్యోగస్తులకు ప్రతినెలా సక్రమంగా ట్రెజరీ ద్వారా వేతనాలు అందిస్తున్నాం. లోక్ అదాలత్ ద్వారా పెన్షనర్ల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. డిడిఒల ద్వారా ప్రతినెల 25వ తేదీన వేతనాలు పెట్టి ఒకటవ తేదీన వేతనాలు అందే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

ప్ర : పెన్షనర్లు, ఉద్యోగుల వేతనాలు పంపిణీలో సాంకేతిక సమస్యలు ఉన్నాయా?

జ : జిల్లా కార్యాలయం మూడో అంతస్తులో ఉన్నందున పనుల నిమిత్తం చాలామంది పెన్షనర్లు కార్యాలయానికి రావడానికి ప్రయాస పడుతున్నారు. ఇదే విషయాన్ని గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. కార్యాలయానికి సొంతభవనం నిర్మించే వరకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. కార్యాలయ మెయింటెనెన్స్‌కు నిధులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఇంటర్నెట్ తదితర సౌకర్యాలకు సైతం సొంత నిధులను వాడుతున్నాం.

ప్ర : జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉందా?

జ : శ్రీ సత్యసాయి జిల్లా ట్రెజరీ కార్యాలయంలో సిబ్బంది కొరత ఉంది. ఎస్టీవోలు ఆరుగురు ఉండాల్సుండగా ప్రస్తుతం నలుగురే ఉన్నారు. అదేవిధంగా ఐదుగురు సీనియర్ అసిస్టెంట్లు ఉండాల్సుండగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్లు ప్రస్తుతం ముగ్గురు ఉన్నారు. ఇంకా ఇరువురు కావాలి. ఉన్న సిబ్బందితోనే పనులు చేస్తున్నాం.

ప్ర : ఉద్యోగులకు, పెన్షనర్లకు జిపిఎఫ్ అందుతున్నాయా?

జ : (జిపిఎఫ్) జనరల్ ప్రావిడెంట్ ఫండ్, సరెండర్ లీవ్, ఎన్కాష్మెంట్ ఆఫ్ లీవ్, జిపిఎఫ్ మెడికల్ లీవులు జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నాయి. ఏ ఉద్యోగికి అందలేదు. ఉద్యోగస్తులు వారి అవసరాల నిమిత్తం ఉంచుకున్న సొమ్ము సరైన సమయంలో అందించక పోవడంతో వారు కొంత అసౌకర్యానికి గురవుతున్నారు. జిల్లా కార్యాలయపు బడ్జెట్‌ను బట్టి వాటర్, కరెంటు, స్టేషనరీ తదితర బిల్లులను కార్యాలయం నుండి చెల్లిస్తాం.





జిల్లా ఉప ఖజానా సంచాలకులు కావలి రామారావు నాగమల్లిక

ప్రజాశక్తి
www.prajasakti.com

చీరలే తలుపులు..



మరుగుదొడ్లకు వేలాడదీసిన తలుపులు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

అక్కడ మరుగుదొడ్లకు తలుపులు లేవు.. చీరలే వాటికి తలుపులు.. ఎక్కడో కాదు.. బొమ్మనహాల్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో పరిస్థితి. అంగన్వాడీ కేంద్రంలోని మరుగుదొడ్లకు తలుపులు లేని కారణంగా మహిళలు చీరలను అడ్డుగా పెట్టుకున్నారు. ఆ చీరలు గాలి వస్తే ఎగిరిపోతుంటాయి. అలాంటి మరుగుదొడ్లలో కాలకృత్యాలు తీర్చుకోవాలంటే వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లకు తలుపులు నిర్మించాలని మహిళలు కోరుతున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-పామిడి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో సిపిఎం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటగా సిపిఎం సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి సిపిఎం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా.. రాజకీయ నాయకులు మారుతున్నా మండలంలో మాత్రం సమస్యలు సమస్యలుగానే ఉన్నాయన్నారు. పామిడి పంచాయతీలో ఇంతవరకూ ఉపాధి హామీ పథకం లేకపోవడం శోచనీయమన్నారు. పామిడిలో ఉపాధి లేక పేదలు అనేక మంది ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా గజరాంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్, కార్యవర్గ



సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు

సభ్యులుగా శంకర్, ముత్యాలు, సబేరా, ఆనంద్, లాజర్, బి.ఆనంద్‌ను ఎన్నుకున్నారు. అనంతరం మల్లేష్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సిపిఎం నిబంధనలకు లోబడి రైతులు, కార్మికులు, ప్రజా సమస్యలపై కమిటీ సభ్యులను సమన్వయం చేసుకుని పోరాటాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామునాయక్, నాయకులు రాజు, నాగరాజు, బాబా ఫక్రుద్దీన్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

టపాసులు అక్రమంగా విక్రయిస్తే చర్యలు

ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో చట్ట వ్యతిరేకంగా టపాసులు విక్రయించినా, నిల్వ ఉంచినా చర్యలు తప్పవని ఎస్పీ పి.జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బాణాసంచా విక్రయ లైసెన్స్ కలిగిన దుకాణదారులు మాత్రమే టపాసులు విక్రయించాలన్నారు. మిగితా ఎవరు అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాశ్వత, తాత్కాలిక లైసెన్సు కల్గిన దుకాణాల్లో మాత్రమే బాణాసంచాను విక్రయించాలన్నారు. తాత్కాలిక లైసెన్సుదారులు ప్రభుత్వ యంత్రాంగం సూచించిన బహిరంగ ప్రదేశాల్లో నిర్ణీత కొలతల మేరకు ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేసుకోవాన్నారు. నియమ నిబంధనలు పక్కాగా పాటించాలన్నారు. నీరు, ఇసుక, తదితర అగ్నిమాపక సామగ్రిని తప్పనిసరిగా టపాసుల విక్రయ దుకాణాల్లో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆ పరిసరాల్లో ఏం చేయాలో, ఏం చేయకూడదో తగు సూచనలు చేస్తూ బోర్డులను ప్రదర్శనలో ఉంచాలన్నారు. 18ఏళ్లలోపు పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. ఇకపోతే దీపావళి పర్వదినం జిల్లా ప్రజలు ఆనందంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ముఖ్యంగా పిల్లలు పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పెద్దల పర్యవేక్షణలోనే పిల్లలు టపాసులు కాల్చాలన్నారు. ఇళ్లలోపల కాకుండా బయట ఖాళీ ప్రదేశాల్లో బాణాసంచా కాల్చాలన్నారు. తారాజువ్వల్లాంటి టపాసులను గడ్డివాములు, గుడిసెలు, పెట్రోలు బంకులు వద్ద కాల్చరాదన్నారు. విద్యుత్ తీగలు, చెట్లు కింద కాలిస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంటుందన్నారు. బాణాసంచా కాల్చేటప్పుడు సింథటిక్ దుస్తులు కాకుండా తేలికైన కాటన్ దుస్తులు ధరించాలన్నారు. సరదా కోసం చేతులతో పట్టుకుని టపాసులు కాల్చరాదన్నారు. బాణాసంచాను దీపాలు, లాంతర్లు వద్ద ఉంచరాదన్నారు. వంటగది కిటికీలు మూసేయాలన్నారు. పొడగాటి అగరబత్తులు, కొవ్వొత్తుల ద్వారానే కాల్చాలన్నారు. రెండు బకెట్ల నీటిని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సగం కాలిన, ఆరిపోయిన టపాసులను తిరిగి కాల్చే ప్రయత్నం చేయరాదన్నారు. జిల్లాలో ఎక్కడైనా ప్రమాదం చోటు చేసుకున్నా... అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా వెంటనే డయల్ - 100, 112, లేదా సబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం చేరవేయాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేసిన విజయభాస్కర్ కుటుంబ సభ్యులు

నార్పల : అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తుపాకుల విజయభాస్కర్, రమాదేవి దంపతులు రూ.25వేలు ఆర్థికసాయం అందజేశారు. మండల కేంద్రంలో గ్రామస్తుల సహకారంతో అయ్యప్పస్వామి ఆలయాన్ని నిరిస్తున్నారు. దీంతో ఆలయ నిర్మాణానికి తమవంతు సాయంగా విజయభాస్కర్, రమాదేవి కుమారులు జశ్వంత్, క్రిష్వంత్ కలిసి బ్రహ్మేంద్రస్వామికి విరాళాన్ని అందించారు.

'చెకుముకి' విజేతలకు అభినందన



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో గేయానంద్

గుత్తి : చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన ఏపీ ఆదర్శ పాఠశాల విద్యార్థులను పలువురు అభినందించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షల్లో ఏపీ ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు సాయిధీరాజ్, నందిని, హితేష్ వర్ధన్ లు ప్రథమ స్థానం కైవాసం చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ, జెవివి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, జిల్లా అధ్యక్షులు పి. వెంకటరామిరెడ్డితో విజేతలు ప్రథమ బహుమతి అందుకున్నారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఉష, ఉపాధ్యాయులు,సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్టాపన



విగ్రహానికి పూజలు చేస్తున్న వాల్మీకులు

బొమ్మనహాల్ : మండలంలోని నేమకల్లు గ్రామంల్లో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ప్రతిష్టించారు. ముందుగా వాల్మీకి విగ్రహానికి వేదపండితులు మంత్రోత్సవాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీ తలారి రంగయ్య, వాల్మీకి సంఘం నాయకులు కరెంటు వన్నప్ప, వన్నూరుస్వామి, ఎంపిపి కందేపల్లి రమేష్, వాల్మీకి సంఘం గ్రామ అధ్యక్షులు నాగి, బోయ గోవిందప్ప, బోయ ఆంజనేయులు, బోయ హనుమంతప్ప, పెద్దఎత్తున వాల్మీకులు పాల్గొన్నారు.

'లేపాక్షి ఫౌండేషన్' పోస్టర్ల ఆవిష్కరణ



లేపాక్షి ఫౌండేషన్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అతిథులు

అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లా యువకులు వడ్డీ సుధాకర్, చిన్నారి అనిల్‌కుమార్, జి.అశోక్ కుమార్, డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లేపాక్షి ఫౌండేషన్ పోస్టర్ల ఆవిష్కరణ ఆదివారం విజయవాడలోని విజయవాడ బుక్ ఫెస్టివల్స్ సొసైటీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి జానపదకళల తొలి అధ్యక్షులు పొట్లూరి హరికృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు , మద్దుల విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అధికారులకు సన్మానం

శింగనమల : మండల పరిధిలోని వెస్టు నరసాపురం పంచాయతీ నాగులగుడ్డంలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తుండగా సర్పంచి, గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేశారన్నారు. అలాంటి అధికారులు ఎక్కడ ఉన్నా సంతోషకరమన్నారు. అనంతరం శాలువాలు కప్పి, మొమెంటోలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగులగుడ్డం తండా సర్పంచి లక్ష్మీదేవి, వెస్ట్ నరసాపురం సర్పంచి వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సేవకుల మరణం బాధాకరం

అనంతపురం కార్పొరేషన్ : ఆధ్యాత్మిక సేవకుల అకాల మరణం బాధాకరమని మేయర్ మహమ్మద్ వసీం అన్నారు. శనివారం శింగనమల మండల పరిధిలోని నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి మృతదేహాలను ఆదివారం అనంతపురంలోని పెద్దాసుపత్రిలోని మార్చురీ గతిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. ఎంతో ఉన్నత భవిష్యత్ ఉండి నిత్యం దైవ నామస్మరణతో గడిపే యువకులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం ఎంతో బాధాకరమన్నారు. మేయర్ వెంట కార్పొరేటర్లు సైఫుల్లా, కమల్‌భూషణ్, తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మేయర్ మహమ్మద్‌వసీం, నాయకులు

మైనింగ్ మాఫియాను అరికట్టాలి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు



ప్రజాశక్తి-రాయదుర్గం

కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాల్ మండలంలో రేయింబవళ్లు కొనసాగుతున్న మైనింగ్ మాఫియాను అరికట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్వయంగా సిఎం చంద్రబాబు చెప్పినా మైనింగ్ మాఫియా ఆగడాలు ఆగడం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు జాతీయ రహదారి పక్కనే భారీగా గ్రావెల్ తవ్వకాలు చేస్తున్నారన్నారు. కొందరు కొండ, గుట్ట, మెట్ట అన్నీ మావే అన్నట్లు కొల్లగొట్టేస్తున్నారన్నారు. సరిహద్దు ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని దోపిడీ పర్వానికి తెరతీశారన్నారు. యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తూ రూ.కోట్లు ఆర్జిస్తున్నారన్నారు. ఇవన్నీ అధికారులకు తెలిసినా ఏమీ చేయలేని పరిస్థితి అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులతోపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించి మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'శ్రీకృష్ణ' భక్తుల మృతి బాధాకరం



మృతదేహాలను పరిశీలిస్తున్న బండారు లీలావతి

శింగనమల : మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగుకు శ్రీకృష్ణ భక్తులు మృతిచెందడం బాధాకరమని టిడిపి నాయకురాలు బండారు లీలావతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం అనంతపురంలోని మార్చురీలో ఉన్న మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను మండల టిడిపి నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. తర్వాత వైద్యులతో మాట్లాడి పోస్టుమార్టం ఏర్పాట్లపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాడిపత్రిలో సంకీర్తన చేసి వస్తూ మృత్యువాత పడటం బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు భగవంతుడు ధైర్యం ఇవ్వాలని కోరారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అతిథులు

ఉరవకొండ : నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్‌కె ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలో 350 మంది పాల్గొన్నారు. జూనియర్స్ విభాగంలో 4, 5, 6వ తరగతులు, సీనియర్స్ విభాగంలో 7, 8, 9వ తరగతి చదివే విద్యార్థులకు రంగోలి, స్కిప్పింగ్, బెస్ట్ ఫ్రమ్‌వేస్ట్, పేపర్ క్రాఫ్ట్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు నవంబర్ 14న పెద్దల ఆధ్వర్యంలో బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు తిరుపతయ్య, నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు తాటికొండ వెంకట్, ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్, శ్రీదేవి, శైలజ, నిర్మల, భాగ్య, సుజాత, వేణుగోపాల్, రాజశేఖర్, తరుణ్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి ఫరూక్‌కు జిల్లా ఆల్‌మేవా ప్రతినిధుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఆల్‌మేవా సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం ఆదివారం నంద్యాలలోని నేషనల్ పీజీ కళాశాలలో రాష్ట్ర ఆల్ మైనారిటీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఆల్ మేవా) రాష్ట్ర వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫారూఖ్‌కు ఆల్‌మేమా ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనార్టీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. మైనార్టీ ఉద్యోగుల సంఘం బలోపేతానికి తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. మైనారిటీలకు సబ్‌ప్లాన్ అమలు చేయాలని, వక్ఫ్ అమెండ్మెంట్ యాక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించాలని, వక్ఫ్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని రక్షించాలని, ప్రధానమంత్రి 15 సూత్రాల పథకం అమలులో ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున ప్రతి జిల్లా కమిటీలో ఇద్దరు ఆల్‌మేవా సభ్యులను నియమించాలని కోరారు. ముస్లిములకు 4శాతం రిజర్వేషన్లను కొనసాగితించాలని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించే పరీక్షల్లో ముస్లిములకు ఒబిసి రిజర్వేషన్లను అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో మైనారిటీలకు సముచితంగా నిధులు కేటాయించాలని, రాష్ట్రంలో పిఎంజెవికె పథకం ద్వారా కేటాయించి సముదాయాలను త్వరితగతిన పూర్తి చేయాలని, ఉర్దూ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్ల ను కాంటాక్ట్ లెక్చరర్లుగా మార్పు చేయాలని, ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బ్యాక్‌లాగ్ ఉపాధ్యాయుల పోస్టులను డిరిజర్వ్ చేయడం ద్వారా స్పెషల్ డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు.



మంత్రి ఫరూక్‌తో జిల్లా ఆల్‌మేవా ప్రతినిధులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కణేకల్లులో ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-కణేకల్లు

మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1982-83లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక బిస్మిల్లా ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తర్వాత ఒకరి క్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. ఎవరెవరు ఏ ఏ వృత్తుల్లో స్థిరపడ్డారు.. ఏమేం చేస్తున్నారనే విషయాలను ఆరాతీస్తూ సంతోషంగా గడిపారు. 42ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడంతో ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ గురువులు కొట్టి, తిట్టి చదువులు చెప్పడం వల్లే తాము ఈస్థాయికి ఎగిగామన్నారు. తర్వాత అప్పటి గురువులకు శాలువాలు కప్పి, పూలమాలు వేసి ఘనంగా సత్కరంచారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, పూర్వ విద్యార్థులు నబిసాబ్, తిమ్మప్ప, వెంకటేశులు, శాంతకుమార్, షర్మాస్, శీన, జెమిని సతీష్, చిదానంద, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో 1990-91లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఇందులో భాగంగా అప్పుడు పాఠశాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి కృషి చేసిన యాడికి మండలం కేంద్రానికి చెందిన పవన్, కాల్వ శ్రీనివాసులు, ప్రింటింగ్ ప్రెస్ సీనా, నూర్‌బాషా, కొత్త రాయుడు, ప్రభాకర్, బంగారు బాల, రామయ్య, షర్మాస్‌వలి, తదితర మిత్రులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు అశ్వర్థరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, మహబూబ్‌బాషా, జనార్ధన, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ముదిగల్లు రోడ్డులో ఉన్న లిటిల్ రోజెస్ పాఠశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 40 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 18 మందికి శస్త్ర చికిత్స అవసరం కాగా కడపలోని శ్రీ పుష్పగిరి కంటి ఆసుపత్రికి సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు పగడాల మల్లికార్జున, కార్యదర్శి కంబాల తిమ్మారెడ్డి, జనసేన నాయకులు లక్ష్మీనారాయణ, వైద్యులు కళ్యాల చిన్న మల్లప్ప, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

జీవాలకు నట్టల నివారణ టీకా



జీవాలకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి నవీన్‌కుమార్

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పాలేపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేసినటుల మండల పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. గ్రామంలో 3865 జీవాలకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఆరోగ్య మిత్రులు లింగన్నగౌడ్, అబ్దుల్‌జలీల్, కులశేఖర్, సుధా, మారెక్క, మంజుల, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రోడ్డు మరమ్మతులు



రోడ్డు గుంతలకు మట్టి వేస్తున్న వడ్డే క్యాంపు గ్రామస్తులు

బొమ్మనహాల్ : మండలంలోని కణేకల్-బళ్లారి ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రామస్థులే స్వయంగా కంకర, మట్టి వేసి మరమ్మతులు చేసుకున్నారు. జిందాల్ పరిశ్రమకు వచ్చే భారీ వాహనాల వల్ల పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయంపై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. దీంతో చేసేదిలేక వడ్డే క్యాంపు గ్రామస్తులు స్వచ్ఛందంగా రహదారికి మట్టి, కంకర వేసి మరమ్మతులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కృష్ణాపురం రాము, వడ్డే పక్కీరప్ప, బోయ వన్నూరుస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

పెనుకొండ టౌన్ : ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాలను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కూటమి పార్టీలు ఎన్నికల వాగ్దానాలకు విరుద్ధంగా విద్యుత్ ఛార్జీలను 44 శాతం పెంచడాన్ని సిఐటియు ఖండిస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి ఎన్నికల్లో ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా పెంచడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, నాయకులు ఆటో నాగప్ప, రిజ్వాన్, ముత్యాలు పాల్గొన్నారు.

ఒంటరి మహిళకు ఆశ్రయం



అనాథ మహిళను ఆశ్రమంలో చేర్చుకుంటున్న నిర్వాహకురాలు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని శివాలయం వద్ద నివాసం ఉండే ఒంటరి మహిళ పార్వతమ్మను చెన్నకేశవ అనాథాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. పార్వతమ్మకు రక్తపోటు అధికమై నాలుగు రోజుల క్రితం అపస్మారకస్థితిలోకి వెళ్లింది. దీంతో స్థానికులు, పోలీసులు ఆమెను అనంతపురం ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. తర్వాత బంధువులకు సమాచారం అందించినా పట్టించుకోలేదు. దీంతో తమ ఆశ్రయంలో చేర్చుకున్నట్లు చెన్నకేశవ అనాథాశ్రమం నిర్వాహకులు స్రవంతి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

'గ్రీవెన్స్'ను సద్వినియోగం చేసుకోండి

కళ్యాణదుర్గం రూరల్ : నేడు పట్టణంలో నిర్వహించనున్న పబ్లిక్ గ్రీవెన్స్‌ను ప్రజలు వినియోగించుకోవాలని అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజనల్ పరిధిలోని ప్రజల సౌకర్యార్థం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

ఉరవకొండ : విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు మృతిచెందిన ఘటన ఆదివారం విడపనకల్లు మండలంలో చోటు చేసుకుంది. మండలం పరిధిలోని హావళిగి గ్రామానికి చెందిన వరలక్ష్మి (36), పెన్నయ్య దంపతులకు విడపనకల్లులో ఉన్న ఐదెకరాల పొలంలో మిరప పంట సాగు చేశారు. ఇందులో భాగంగానే ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఈ క్రమంలో వరలక్ష్మి పొలానికి నీళ్లు పెట్టడానికి స్టార్టర్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు ప్రమాదం జరిగిన స్థలానికి వెళ్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలికి కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈతకెళ్లి యువకుడు...

రాయదుర్గం : .రాయదుర్గం పట్టణ శివారులోని బిటిపి లేఅవుట్‌కు చెందిన యువకుడు ఈతకు వెళ్లి మృతిచెందాడు. ఆదివారం కాలనీకి చెందిన హరి, వరలక్ష్మిల కుమారుడు కళ్యాణ్‌రామ్(19) తోటి స్నేహితులతో కలసి సమీపంలోని నీటిగుంతలో ఈతకు వెళ్లారు. కళ్యాణ్‌రామ్‌కు ఈతరాకపోవటంతో నీటిలో మునిగి మృతిచెందాడు. తొమ్మిదవ తరగతి వరకు చదువుకున్న కళ్యాణ్ రామ్ కుటుంబపోషలో తల్లిదండ్రులకు ఆసరాగా ఉండేవాడు. ఈ మేరకు స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

గుత్తి : మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని ఎంగిలి బండ గ్రామ సమీపంలో 67వ జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఐచర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో బైక్ పై వెళ్తున్న గుత్తి పట్టణానికి చెందిన రాజేంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పట్టణంలోని కర్నూలు రోడ్డులో 44వ జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో బసినేపల్లికి చెందిన హుసేన్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయపడ్డ అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుల సూచన మేరకు అదనపు చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్టు

పెద్దవడుగూరు : మండలంలోని మేడిమాకులపల్లిలో ఆదివారం పేకాట స్థావరంపై దాడి చేసి 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. యాడికి మండలానికి నిందితులు మేడిమాకులపల్లిలోని చింతచెట్టు కింద పేకాట ఆడుతుండేవారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్టు చేయడంతోపాటు రూ.11,520 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.